నేడు మెగా లోక్ అదాలత్

దుండిగల్, జూన్ 7: కూకట్‌పల్లి కోర్టులో ఈనెల 8వ తేదీన(శనివారం) జరిగే మెగాలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని బాచుపల్లి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎవరివైనా కేసులు ఉంటే మెగాలోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారం కోసం ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. కక్షదారులు కూకట్‌పల్లిలో జరిగే మెగా లోక్ అదాలత్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 7: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీడీఎంఎస్ కోఫెమ్)లో వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ రమాప్రభ, ప్రిన్సిపాల్ కె. విజయ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. బీఏ కర్ణాటక సంగీతం (ఫుల్ టైం), ఎంఏ కర్ణాటక సంగీతం (పార్ట్ టైం ఇన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కోర్సులలో చేరేందుకు కేవలం మహిళలే అర్హులని పేర్కొన్నారు. కర్ణాటక వోకల్‌లో ఒక సంవత్సరం (బ్రిడ్జి కోర్సు, డెవోషనల్ మ్యూజిక్ (సంకీర్తన)లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు, వీణ, వయోలిన్, కీబోర్డ్, ఫ్లూట్‌లలో ఒక సంవత్సరం సర్టిఫికెట్ కోర్సు, సౌందర్య లహరి, ఆర్‌జే, వాయిస్ ఓవర్, యాక్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడింగ్, రిపోర్టింగ్, ఎడిటింగ్, డబ్బింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో సర్టిఫికెట్ కోర్సు, టెక్చర్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, క్యాండిల్ మేకింగ్, తంజావూర్ పెయింటింగ్, కార్టూనింగ్, డాల్స్ మేకింగ్, క్రోచెట్, స్టోరీ టెల్లింగ్ విత్ ఫ్లాష్ కార్డ్స్, బ్యూటీషియన్, హెయిర్ స్టైల్స్, కౌన్సెలింగ్ ఫర్ చిల్డ్రెన్ అవేర్‌నెస్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అన్ని కోర్సుల్లో చేరేందుకు మహిళలతో పాటు పురుషులు కూడా అర్హులని వివరించారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 944176 8811, 9393949415 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సంతానోత్పత్తి చికిత్సకెళ్తే.. ప్రాణం పోయింది..

- డాక్టర్లపై అనుమానంతో పోలీస్‌స్టేషన్‌లో భర్త ఫిర్యాదు
- శ్మశానవాటికలో పూడ్చిన మృతదేహాన్ని బయటికి తీసి.. పోస్ట్‌మార్టానికి పంపిన పోలీసులు

మృతి చెందిన పర్ణీత(ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 7:మాతృత్వం(సంతానోత్పత్తి) కోసం వైద్యశాలకు వెళ్లిన ఓ మహిళకు చికిత్స చేస్తుండగా.. గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని బేగంపేట కుందన్‌బాగ్‌లో మొలకల కరుణాకర్ రెడ్డి, మేరీ పర్ణీత యేరువా (38) దంపతులు నివసిస్తున్నారు. వీరికి సంతానం లేకపోవడంతో కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని ప్రసాద్ వైద్యశాలలో నీరజావల్లి డాక్టర్ వద్ద గత 9 నెలలుగా హిస్టెరోస్కోపి చికిత్స తీసుకుంటున్నారు. ఈ చికిత్సలో భాగంగా మే 31న ఉదయం పర్ణీత దంపతులు వైద్యశాలకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చికిత్స నిమిత్తం పర్ణీతను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు డాక్టర్లు. చికిత్స మొదలు పెట్టిన రెండు గంటల తర్వాత ఆమెకు గుండెపోటు వచ్చింద, పరిస్థితి సీరియస్‌గా ఉందని డాక్టర్లు ఆమె భర్తకు సమాచారం ఇచ్చారు. భర్త వెంటనే డాక్టర్లను కలిసి ఆమెను అంబులెన్స్‌లో యశోద వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి సీరియస్‌గా ఉందని, ఆమెకు వైద్యం చేయడం కుదరదని డాక్టర్ల కౌన్సెలింగ్ ఇస్తుండగానే, పర్ణీత వైద్యశాలలోనే కుప్పకూలిపోయింది. మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించగా, జూన్ 1వ తేదీ ఉదయం మృతదేహాన్ని గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని శ్మశాన వాటికలలో(క్రిస్టియన్ ఆచారం ప్రకారం) మృతదేహాన్ని పూడ్చిపెట్టి అంత్యక్రియల ఘట్టాన్ని పూర్తి చేశారు. తర్వాత ప్రసాద్ వైద్యశాలలో చికిత్స చేసిన ఐవీఎఫ్ డాక్టర్ నీరజావల్లి, మత్తు మందు నిపుణుడు(అనస్థీషియా డాక్టర్)సతీశ్‌లను భర్త కరుణాకర్‌రెడ్డి కలిశాడు. డాక్టర్లు ఇద్దరు పొంతనలేని సమాధానం చెప్పడంతో డాక్టర్ల నిర్లక్ష్యంతోనే తన భార్య చనిపోయిందని నిర్ధారించుకున్న కరుణాకర్‌రెడ్డి కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా శుక్రవారం గాజులరామారంలోని శ్మశానవాటికలో పూడ్చిన శవాన్ని బయటికి తీసి పోస్టుమార్టానికి పంపించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత నిజనిర్ధారణ జరుగుతుందని పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : డీసీ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చందానగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. సమతుల్యత లోపిస్తే మనుగడే కష్టమన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాల పోస్టర్‌ను డీసీ వంశీకృష్ణ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పచ్చదనం లోపిస్తుండటం వల్ల ఇప్పటికే ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ ప్రమాదాన్ని గుర్తించి పరిరక్షణకు పాటుపడాలని, స్వార్థం కోసం పర్యావరణాన్ని దెబ్బతీయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ పులి అమృత్ గౌడ్, అశోక్, షేక్ బాజీ, పరమేశ్వర్ పాల్గొన్నారు. – మియాపూర్, జూన్ 7

ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, జూన్ 7: ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌కాలనీలో రూ. 9లక్షల నిధులతో డ్రైనేజీ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా సరే సమస్యలు ఏర్పడితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డ్రైనేజీ సమస్యలున్న చోట సమస్య పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలా రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేయించుకొని పనులు చేపడుతామని తెలిపారు. కె.రాము ముదిరాజ్, వెంకటేశ్, సుబ్బరాయుడు, విద్యాసాగర్, నరయ్య, శ్రీనివాస్, విజయలక్ష్మి, కమల, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా..

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ పరంగా నెలకొన్న సమస్యలను స్థానికులు కార్పొరేటర్‌కు విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ వెంకటేశ్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని , పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను త్వరలో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందిస్తానని, కాలనీలను పురోగతి వైపు నడిపిస్తానని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, రవికుమార్, నాగేశ్వర్‌నాయక్ , నర్సింహులు, సుదర్శన్, నరేందర్,కాలనీ ప్రతినిధులు సత్యనారాయణ, మురళీకృష్ణ, మోహన్, రఘుపతి, హన్మంతరావు, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్,చ శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. కూకట్‌పల్లి ఏసీపీ హన్మంతారావును కార్పొరేటర్ వెంకటేశ్ ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. – మియాపూర్, జూన్ 7

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కేఎస్‌ఆర్‌ను కలిసి సమస్యలు తెలియజేస్తున్న ప్రజలు

దుండిగల్, జూన్7: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి (కేఎస్‌ఆర్)అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన ప్రజలు శుక్రవారం కేఎస్‌ఆర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు

–నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, మధురానగర్‌లోని శ్రీఅష్టలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం కేఎస్‌ఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ స్లాబ్ నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, విష్ణువర్ధన్‌రావు, లింగయ్య, రాంబాబు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

మున్సిపల్ అధికారులకు బీఆర్‌ఎస్ నేత ఫిర్యాదు

దుండిగల్ మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నేత కుంటి నాగరాజు

దుండిగల్,జూన్ 7: గ్రామకంఠం భూమిలోని చేదబావి(మంచినీళ్ల)ని పూడ్చి, దానిపై చేపట్టిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని గాగిల్లాపూర్ ఒకటవవార్డు కౌన్సిలర్ కుంటి అరుణ భర్త,బీఆర్‌ఎస్ నేత కుంటి నాగరాజు దుండిగల్ మున్సిపాలిటీ అధికారులను కోరారు.ఈ మేరకు శుక్రవారం ఇందుకు సంబంధించి ఆయన మున్సిపాలిటీ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ దుండిగల్,మున్సిపాలిటీ పరిధి,గాగిల్లాపూర్‌లోని గ్రామకంఠం భూములల్లో పలు అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయని,మున్సిపాలిటీ నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే ఓ వ్యక్తి 500 గజాల స్థలంలో ఐదుఅంతస్థుల భవణం నిర్మిస్తున్నాడని,గతంలో గ్రామస్థులకు తాగునీటిని అందించిన చేదబావిని పూడ్చిన కొందరు వ్యక్తులు సుమారు 150 గజాల స్థలంలో ఇంటినిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు.ఇదే విషయమై మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.అధికారుల తీరుపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు.ఇప్పటికైె అధికారులు స్పందించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడరిటీ చైల్డ్ ఫౌండేషన్, హోలిస్టిక్ హస్పిటల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో లింగంపల్లి పాపిరెడ్డికాలనీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో హోలిస్టిక్ హస్పిటల్ డాక్టర్ తారక్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, జూన్ 7

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

బక్రీద్ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూరారం సీఐ ఆకుల వెంకటేశం అన్నారు. ఈ నెల17న బక్రీద్ పండుగ, తొలి ఏకాదశి పర్వదినాల నేపథ్యంలో శుక్రవారం సూరారం పోలీస్‌స్టేషన్‌లో వివిధ మతాలకు చెందిన పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని, చట్టానికి వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశంతోపాటు వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు. – దుండిగల్, జూన్ 7

కార్మికులకు సొంత భవనం ఏర్పాటు చేయాలి

జగద్గిరిగుట్ట, జూన్ 7: నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం భవనం నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. రంగారెడ్డినగర్‌లోని భవానీ శ్రమశక్తి కార్మిక సంఘం సమావేశం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి అథులుగా హాజరైన బాలకోటయ్య, ఏసురత్నం, ఉమామహేశ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ సంఘం కోసం కేటాయించిన స్థలంలో బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేద్దామని సూచించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సాధించుకోవడంతోపాటు అర్హులైన వారికి ఇండ్లు మంజూరయ్యేలా పోరాడుదామన్నారు. స్వామి, హరినాథ్, శ్రీనివాస్, నాగప్ప, రాములు పాల్గొన్నారు.

– మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలి

తెలంగాణ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి ఏసురత్నం కోరారు. శుక్రవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. సకాలంలో జీతాలు ఇవ్వడంతోపాటు ఖాళీలను భర్తీచేయాలన్నారు. అక్రమాలకు పాల్పడకుండా ఎక్కువ రోజుల నుంచి ఒకే చోట పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఎస్ఎఫ్ఏలను బదిలీ చేయాలన్నారు.

బాలుడు అదృశ్యం

గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించిన బాలానగర్ పోలీసులు

తండ్రి రాజశేఖర్‌రెడ్డికి కృతిక్‌ను అప్పగిస్తున్న బాలానగర్ పోలీసులు

బాలానగర్, జూన్ 7: ఆడుకుంటానని బయటకు వెళ్లిన బాలుడు కన్పించకపోవడంతో తల్లిదండ్రులు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగి గంటల వ్యవధిలో సీసీ పుటేజీల ఆధారంగా బాలుడిని గుర్తించారు. ఈ ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి ఏపీహెచ్‌బీకాలనీలో నివాసముండే ఎలిమినేటి రాజశేఖర్‌రెడ్డి కుమారుడు ఎలిమినేటి కృతిక్ కళ్యాణ్‌రెడ్డి(10)గురువారం సాయంత్రం ఆడుకుంటానని ఇంటి నుంచి వెళ్లిన కృతిక్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కంగారుతో బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అనంతరం సీఐ నవీన్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది సీసీ పుటేజీని పరిశీలించారు. సీసీ పుటేజీ ఆధారంగా సైకిల్‌పై గండి మైసమ్మ వైపు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు ఆ దిశగా అడుగులు వేసి కొద్ది గంటల్లోనే బాలుడిని గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి బాలుడిని అప్పగించారు. క్షేమంగా బాలుడిని అప్పగించడంతో తల్లిదండ్రులు బాలానగర్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

మన సంస్కృతిలో ఆభరణాల పాత్ర కీలకం

- 2030 నాటికి 75 బిలియన్ డాలర్ల రత్నాలు, ఆభరణాలే లక్ష్యం
- పోలీస్ జాయింట్ కమిషనర్ (అడ్మిన్)పరిమళ హనా

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హెచ్‌జేఎఫ్ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న పోలీస్ జాయింట్ కమిషనర్ (అడ్మిన్)పరిమళ హనా, నిర్వాహకులు

మాదాపూర్, జూన్ 7: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌జేఎఫ్ (హైదరాబాద్ జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్)ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ జాయింట్ కమిషనర్(అడ్మిన్) పరిమళ హనా హాజరయ్యారు. హెచ్‌జేఎంఏ అధ్యక్షుడు మహేందర్ తాయల్, జంట నగరాల జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాష్ చరణ్, తెలంగాణ బులియన్, జెమ్ అండ్ జ్యువెలరీ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీష పర్షద్ వర్మ, తెలంగాణ పాన్ బ్రోకర్ జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరస్మల్ రాంకా, పాట్ మార్కెట్స్ జ్యువెలర్స్ అసోసియేషన్ అశోక్ ఫెర్మల్ జైన్, ఇన్ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ పలువురితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సాంస్కృతిక వారసత్వంలో ఆభరణాల పాత్ర కీలకమన్నారు. రత్నాలు, ఆభరణాల పరిశ్రమ వినియోగం, ఎగుమతి రెండింటిలోనూ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్ ఫెయిర్ జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్ వంటి ఈవెంట్‌ల రంగంలో భారతదేశం యొక్క నైపుణ్యాన్ని బహిర్గతం చేసే దిశగా ముందంజలో ఉన్నట్లు చెప్పారు. 2030 నాటికి 75 యూఎస్‌డీ బిలియన్ల (రూ. 6.2 లక్షల కోట్లు) రత్నాలు, ఆభరణాల ఎగుమతి లక్ష్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 350 మంది ఎగ్జిబిటర్లు, 750కి పైగా బ్రాండ్‌లను ప్రదర్శించడం జరిగిందన్నారు. 2 లక్షలకు పైగా సరికొత్త డిజైన్‌లు 8 వేల మంది వాణిజ్య కొనుగోలుదారులను ఆకర్షించనున్నాయన్నారు.

సుచిత్ర శ్రీచైతన్యపై ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, జూన్ 7: సుచిత్రలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీచైతన్య పాఠశాలకు అనుమతులు జారీ చేయరాదని కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం విద్యాశాఖ, పోలీస్, సర్కిల్ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేశారు. సుచిత్రలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీచైతన్య పాఠశాలకు ఎలాంటి అనుమతులు రాక ముందే అడ్మిషన్లు నిబంధనలకు విరుద్ధంగా తీసుకోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి సీజ్ చేశారని, దీనికి తోడు ప్రస్తుతం ఆయా విభాగాల నుంచి అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, పూర్తిగా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి, స్థానికంగా ఉన్న బడ్జెట్ స్కూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని, సుచిత్ర శ్రీచైతన్య స్కూల్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 7 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.టమాట 35, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 60, బజ్జి మిర్చి 60, కాకరకాయ 38, బీరకాయ 40, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యారెట్ 37, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 60, ఆలుగడ్డ 34, కీరా 28, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 55, ఉల్లిపోరక 105, ఉల్లిగడ్డ 29, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 33, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండు మిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచేలా..

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 7: కేపీహెచ్‌బీ కాలనీలోని నెక్సెస్ మాల్‌లో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన లెగో ప్లే గ్రౌండ్ సందడిగా మారింది. శుక్రవారం లాంచనంగా ప్రారంభించిన లెగో ప్లే గ్రౌండ్‌లో చిన్నారుకు ఉచిత ప్రవేశం కల్పించగా... చిన్నారులంతా ప్లే గ్రౌండ్‌లోని ఆట వస్తువులతో ఆడుకుంటూ... సృజనాత్మకమైన ఆలోచనలతో విభిన్నమైన ఆకారాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లే గ్రౌండ్‌లో సూపర్ స్టార్ వార్స్, మార్వెల్, డీసీ నుంచి సూపర్ హీరో స్పేస్‌షిప్‌లు, యాక్షన్ మెచ్‌లు, ఎక్స్‌ప్లోరర్స్ జోన్‌లలో పిల్లలు స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ వెహికిల్స్ స్క్వాడ్‌లు, ఐకానిక్ లెగో విగ్నిఫిగర్, రెడ్ టెలిఫోన్ బాక్స్, నిన్జాగో సిటీ గార్డెన్, డిస్నీ కాజిల్, గ్రింగోట్స్, విజార్డింగ్ బ్యాంక్, ఎవెంజర్స్ టవర్, ఈఫిల్ టవర్, టైటానిక్‌లు ఏర్పాటు చేశారు. పిల్లలందరూ కలిసి సరదా పోటీలు, సవాళ్లు, క్విజ్‌లలో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. టీవీలు, సెల్‌ఫోన్ వీడియోలతో కాలం గడుపుతున్న చిన్నారులకు ఆటవిడుపు...సృజనాత్మకత ఆలోచనలను పెంపొందించేందుకు ప్లే గ్రౌండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని చిన్నారుల తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. ఈ ప్లే గ్రౌండ్... జూన్ 16 వరకు కొనసాగుతుందని, ప్రతి రోజు మధ్యాహ్నం 1గంట నుంచి రాత్రి 9 గంటల వరకు, 5 నుంచి 14 సంవత్సరాల చిన్నారులకు ఉచితంగా ప్రవేశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని కలిసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 7 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి పాలైనా... ప్రజా క్షేత్రంలోనే ఉంటానని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్యవారధిగా ఉండి అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తానని వికారాబాద్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఓటర్లు.. బీజేపీ పార్టీకి ఓటెయ్యడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ఓట్లు తగ్గాయన్నారు. అనతికాలంలో కూకట్‌పల్లి ఓటర్లు భారీగా ఆదరించారన్నారు. కూకట్‌పల్లిలో తన గెలుపు కోసం ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని, కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రవీణ్‌కుమార్, రమేశ్, రజిత, జోజమ్మ, అరవిందర్‌రెడ్డి, మేకల మైకల్, అబ్దుల్ బాకీ, శేఖర్, శైలేష్, అప్పారావు, ఫణీకుమార్, రాజేందర్, ఆసీఫ్, బాబ్జీ, మల్లి, రవికుమార్, నితీశ్‌గౌడ్, లుంగీరాజు, సంధ్య, సుందరీ, లక్ష్మి, అరవింద, సాయితేజ, రేణుక, విజయలక్ష్మి, సుకన్య తదితరులు ఉన్నారు.

సర్దార్‌పటేల్ నగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీపుష్పయాగం చేస్తున్న పురోహితులు, పాల్గొన్న భక్తులు

కోలాహలంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 7 : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం విశ్వక్షేనారాధనం, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ, తదుక్త హవనం, పూర్ణాహుతి, శ్రీస్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. సాయంత్రం పుష్పయోగ శోభాయాత్ర, శ్రీపుష్పయాగం పూజలు చేశారు. రాత్రి శ్రీవారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు మూడు పూటలా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పోచమ్మతల్లి కళ్యాణ మహోత్సవాలు

అల్లాపూర్, జూన్ 7: కబీర్‌నగర్ గ్రామదేవత పోచమ్మతల్లి కళ్యాణ మహోత్సవాలు నేటినుంచి మూడు రోజుల పాటు జరుగనున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు శనివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, తిరిగి సాయంత్రం భక్తులందరూ కలిసి తెప్పకు బయలుదేరుతారు. రెండోరోజు ఆదివారం ఉదయం 10 గంటలకు పోచమ్మ తల్లి కళ్యాణం, అనంతరం అన్నప్రసాదం వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడోరోజు అమ్మవారి బోనాలు, తొట్టెల ఊరేగింపుతో కార్యక్రమాలు ముగుస్తాయని ప్రకటించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై ఉత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.